AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
14-11-2025 (Friday)
MAIN EDITION

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై కవిత ఆసక్తికర ట్వీట్




**అక్షరటుడే, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాల నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత స్పందించారు. 'ఎక్స్'లో ఆసక్తికర పోస్టు చేశారు. 'కర్మ హిట్స్ బ్యాక్' అంటూ తన 'ఎక్స్' ఖాతాలో రాశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ నెట్టింట వైరల్‌గా మారింది. బీఆర్ఎస్ పెద్దలను ఉద్దేశిస్తూ ఈ ట్వీట్ చేశారంటూ నెటిజన్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## 159 పరుగులకు సౌతాఫ్రికా ఆలౌట్



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** ఈడెన్ గార్డెన్స్ వేదికగా భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా 159 పరుగులకు ఆలౌటైంది. 154/8తో చివరి సెషన్‌ను ఆరంభించిన సఫారీలు మరో ఐదు పరుగులే చేసి మిగతా రెండు వికెట్లు కోల్పోయారు. ఆ జట్టులో ఓపెనర్ ఐడెన్ మార్‌క్రమ్ (31; 48 బంతుల్లో) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సిరాజ్ 2, కుల్‌దీప్ యాదవ్ 2, అక్షర్ పటేల్ ఒక వికెట్ పడగొట్టారు. ఇక అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు ఒక వికెట్ కోల్పోయి 37 పరుగులు చేసింది. క్రీజులో కేఎల్ రాహుల్, వాషింగ్టన్ సుందర్ ఉన్నారు.

## డ్రోన్, స్పేస్ సిటీలకు శంకుస్థాపన



అక్షరటుడే, అమరావతి : ఏపీ మరో రెండు అభివృద్ధి కార్యక్రమాలు పురుడుపోసుకున్నాయి. దేశంలోనే తొలిసారిగా డ్రోన్, స్పేస్ సిటీల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్న చంద్రబాబు వీటిని ఏర్పాటు చేశారు.

## కూలిన ఐఏఎఫ్ శిక్షణ విమానం



అక్షరటుడే, నేషనల్ డెస్క్: భారత వైమానిక దళానికి చెందిన ఓ శిక్షణా విమానం తమిళనాడులో కుప్పకూలింది. సింగిల్ సీటర్ ట్రైనర్ విమానం చెన్నైలోని తాంబరం ఎయిర్ బేస్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో సింగిల్ సీటర్ విమానం ప్రమాదవశాత్తు కూలిపోయింది.

## హైదరాబాద్ బిర్యానీకి ప్రియాంక ఫిదా



అక్షరటుడే, సినిమాడెస్క్: బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా హైదరాబాద్ బిర్యానీకి ఫిదా అయింది. ఆమె ప్రస్తుతం మహేష్ హీరోగా ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న సినిమాలో నటిస్తోంది. మూవీ షూటింగ్ హైదరాబాద్‌లో సాగుతోంది. ఇటీవల సోషల్ మీడియాలో ఫ్యాన్స్‌తో ముచ్చటిస్తూ హైదరాబాద్ బిర్యానీ అదిరిపోయింది అని పేర్కొంది.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఉత్కంఠగా సాగిన ఉప పోరులో ప్రజలు అధికార పార్టీకే పట్టం కట్టారు. హోరాహోరీగా సాగిన సమరంలో ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్‌కు చెందిన మాగంటి సునీతపై 24,729 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఈ గెలుపుతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొనగా.. బీఆర్ఎస్ కార్యకర్తల్లో నైరాశ్యం అలుముకుంది.**

– అక్షరటుడే, హైదరాబాద్




# కాంగ్రెస్‌దే గెలుపు

■ 24,729 ఓట్ల మెజార్టీతో గెలిచిన నవీన్ యాదవ్ ■ తొలి రౌండ్ నుంచే హస్తం పార్టీ హవా ■ డిపాజిట్ కోల్పోయిన బీజేపీ

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో కౌంటింగ్ నిర్వహించారు. కౌంటింగ్ కోసం మొత్తం 42 టేబుళ్లు ఏర్పాటు చేశారు. తొలుత పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కించారు. అనంతరం ఈవీఎంలలోని ఓట్లను కౌంట్ చేశారు. పది రౌండ్‌లలోనూ కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యం సాధించడం గమనార్హం. ఉత్కంఠగా సాగుతుందనుకున్న వార్ వన్‌సైడ్‌గా మారింది. రాష్ట్ర రాజకీయాలపై పెను ప్రభావం చూపుతుందని భావించిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ సత్తా చాటింది. తొలి రౌండ్ నుంచే స్పష్టమైన ఆధిపత్యం కనబరించింది. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 98,988 ఓట్లు, బీఆర్ఎస్‌కు 74,259, బీజేపీకి 17,061 ఓట్లు వచ్చాయి. మాగంటి సునీతపై 24,729 ఓట్ల మెజార్టీతో నవీన్ యాదవ్ గెలుపొందారు.

### ఫలించిన వ్యూహాలు..

రాష్ట్రంలో చిరునామా గల్లంతయ్యే ప్రమాదకర పరిస్థితి నుంచి అనూహ్యంగా పుంజుకున్న కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారాన్ని చేజిక్కించుకుంది. ఆ తర్వాత జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికలోనూ గెలుపొందింది. తాజాగా జరిగిన జూబ్లీహిల్స్ పోరులోనూ భారీ విజయం నమోదు చేసింది. ఎంతో కీలకమైన ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. బీఆర్ఎస్‌ను కార్నర్ చేయడం ద్వారా ఆ పార్టీ డిఫెన్స్‌లో పడేసిన కాంగ్రెస్ అనేక ఎత్తుగడలతో గెలుపును సొంతం చేసుకుంది. స్థానికుడైన బీసీ నాయకుడికి పోటీలో పెట్టడం, మైనార్టీలను ఆకట్టుకునేందుకు అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం, సినీ కార్మికులు, పేదలను తమవైపు తిప్పుకోవడం తదితర వ్యూహాత్మక అడుగులు వేయడం ద్వారా అధికార పార్టీ సత్తా చాటింది.

| | | |
|---|---|---|
| నవీన్ యాదవ్ (కాంగ్రెస్) | – | 98,988 (50.83 శాతం) |
| మాగంటి సునీత(బీఆర్ఎస్) | – | 74,259 (38.13 శాతం) |
| దీపక్‌రెడ్డి (బీజేపీ) | – | 17,061 (8.76 శాతం) |
| నోటా | – | 924 (0.47 శాతం) |

### కనిపించని సానుభూతి

ప్రత్యర్థి పార్టీని కట్టడి చేయడంలో కాంగ్రెస్ సఫలమైంది. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ భార్య సునీతను బరిలో నిలపడం ద్వారా సెంటిమెంట్ పని చేస్తుందని బీఆర్ఎస్ భావించింది. అయితే, ఆ సెంటిమెంట్ పని చేయకుండా కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. మాగంటి సునీతపై అనేక ఆరోపణలు రావడం బీఆర్ఎస్‌ను తీవ్రంగా దెబ్బకొట్టింది. మాగంటి గోపినాథ్ తల్లి చేసిన సంచలన వ్యాఖ్యలు కాంగ్రెస్‌కు అనుకూలంగా మారాయి. అదే సమయంలో పోల్ మేనేజ్‌మెంట్‌లో హస్తం పార్టీ సఫలమైంది. మంత్రులు, ఎమ్మెల్యేలు సమన్వయంతో పని చేయడంతో ఊహించిన దాని కంటే ఎక్కువ మెజార్టీని సొంతం చేసుకుంది.

### పోటీ ఇవ్వని బీజేపీ

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ కనీస పోటీ ఇవ్వలేకపోయింది. త్రిముఖ పోటీ ఉంటుందని భావించిన స్థానంలో ఆ పార్టీ డిపాజిట్‌ను సైతం కోల్పోవడం గమనార్హం. పార్లమెంట్ ఎన్నికల్లో 8 ఎంపీ సీట్లను గెలుచుకోవడం, ఎమ్మెల్సీ ఎలక్షన్లలోనూ సత్తా చాటడంతో బీజేపీలో కొత్త ఉత్సాహం నెలకొంది. అయితే, స్థానిక సంస్థల ఎన్నికల ముందర జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మాత్రం కనీస పోరాటం చేయకుండా చేతులెత్తేసింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పట్టించుకోక పోవడం వల్లే జూబ్లీహిల్స్‌లో ఓటమి తప్పలేదన్న ప్రచారం జరుగుతోంది.

# ఎన్డీయే ప్రభంజనం

బీహార్‌లో ఎన్డీయే ప్రభంజనం సృష్టించింది. అసెంబ్లీ ఎన్నికల్లో అధికార కూటమి స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించింది. ఈసారి ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలనుకున్న ఆర్జేడీ, కాంగ్రెస్ కలలు కల్లలయ్యాయి. బీజేపీ, జేడీయూ సంచలన ఫలితాలు నమోదు చేశాయి. 243 నియోజకవర్గాలకు రెండు విడతల్లో జరిగిన ఎన్నికల్లో సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు మించి ఎన్డీయే అనూహ్యమైన ఫలితం సొంతం చేసుకుంది. ఏకంగా రెండింట మూడోవంతు స్థానాల్లో ఆధిపత్యం చాటుకుంది. కాంగ్రెస్, ఆర్జేడీ తీవ్రంగా ప్రచారం చేసుకున్న ఓటు చోరీ ఆరోపణలు ఏమాత్రం ప్రభావం చూపలేదు. ప్రభుత్వ వ్యతిరేకత మచ్చుకైనా కనిపించలేదు.

—అక్షరటుడే, నేషనల్ డెస్క్

■ బీహార్‌లో విజయం సాధించిన కూటమి ■ అతిపెద్ద పార్టీగా బీజేపీ ■ కాంగ్రెస్‌కు ఘోర ఓటమి



బీహార్‌లోని 243 అసెంబ్లీ నియోజకవర్గాలకు రెండు విడతల్లో ఎన్నికలు జరిగాయి. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈసారి రికార్డు స్థాయిలో 67 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. పెరిగిన ఓటింగ్ తమపై విశ్వాసానికి ప్రతీక అని ఎన్డీయే కూటమి చెప్పుకోగా, ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శమని ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమి ప్రకటించింది. బీహార్‌లో ఎన్డీయేదే విజయమని అన్ని సర్వేలు వెల్లడించినప్పటికీ, అంచనాలకు మించి అధికార కూటమి సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ బీజేపీ, జేడీయూ సత్తా చాటింది. ఈసారి బీహార్‌లో హోరాహోరీ పోరు తప్పదన్న ప్రచారం జరిగినప్పటికీ, ఫలితం మరోలా వచ్చింది. ఎన్డీయే కూటమి సంచలన విజయం నమోదు చేసింది.

**సీట్ల వివరాలు (ఆధిక్యత)**

| పార్టీ | సీట్లు |
|---|---|
| బీజేపీ | 92 |
| జేడీయూ | 83 |
| ఆర్జేడీ | 26 |
| ఎల్జేపీఆర్వీ | 19 |
| ఎంఐఎం | 5 |
| హెచ్ఎంఎస్ | 5 |
| ఆర్ఎల్ఎం | 4 |
| సీపీఐ (ఎంఎల్) | 2 |
| కాంగ్రెస్ | 5 |
| బీఎస్పీ | 1 |
| సీపీఐ(ఎం) | 1 |

### అనూహ్య మద్దతు..

నవంబర్ 6, 11 తేదీల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. గట్టి భద్రతా ఏర్పాట్ల మధ్య బీహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాలకు ఓట్ల లెక్కింపు నిర్వహించారు. 38 జిల్లాల్లోని 46 కేంద్రాలలో కౌంటింగ్ నిర్వహించగా, ప్రతి రౌండ్‌లో ఎన్డీయే కూటమి ఆధిపత్యం చాటింది. 243 నియోజకవర్గాల్లో మెజార్టీకి మించి స్థానాల్లో ముందంజ వేసింది. ఎన్డీఏ కూటమి సాయంత్రం నాలుగు గంటల వరకు 22 స్థానాల్లో గెలుపొందగా.. 178 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. దీంతో ఆ కూటమి 200 స్థానాలు కైవసం చేసుకునే అవకాశం ఉంది.

### విపక్ష కూటమికి ఘోర పరాభవం

బీహార్‌లో ఎలాగైనా గెలవాలని ఆర్జేడీ, కాంగ్రెస్ ఇతర పార్టీలతో కలిసి మహఘట్‌బంధన్ కూటమి ఏర్పాటు చేశాయి. రాహుల్ గాంధీ బీహార్‌లో జోరుగా ప్రచారం చేశారు. అయితే ఆ కూటమిని ప్రజలు తిరస్కరించారు. ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు, ఓటు చోరీ పేరిట చేసిన ఆరోపణలను ప్రజలు పట్టించుకోలేదు. ఆ కూటమి నాలుగు స్థానాల్లో గెలుపొందగా.. 34 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ఈ ఎన్నికల్లో బీహార్ ప్రజలు కాంగ్రెస్‌కు షాక్ ఇచ్చారు. 61 స్థానాల్లో పోటీ చేసిన హస్తం పార్టీ 5 చోట్ల మాత్రమే ఆధిక్యంలో కొనసాగుతోంది.

## అభివృద్ధి, సంక్షేమానికి పట్టం: పీసీసీ చీఫ్

**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు జూబ్లీహిల్స్‌లో అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించారని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపుపై ఆయన శుక్రవారం నగరంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రణాళిక ప్రకారం.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు పార్టీ కార్యకర్తలు అంతా కలిసి ఉపఎన్నికల్లో గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారన్నారు.

### బీఆర్ఎస్‌కు మనుగడ లేదు

జూబ్లీహిల్స్ ఎన్నికల తీర్పుతో బీఆర్ఎస్‌కు మనుగడ లేదని స్పష్టమైందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో గెలుపుతో బీఆర్ఎస్‌కు స్థానం లేదని ప్రజలు తీర్పునిచ్చారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో బీరాలు పలికిన బీఆర్ఎస్ నాయకుల



మాటలను ప్రజలు నమ్మలేదన్నారు.

### వచ్చే ఎన్నికల్లో వందకుపైగా సీట్లు సాధిస్తాం..

ప్రజలకు జనరంజక పాలన అందిస్తూ.. వచ్చే ఎన్నికల్లో వందకుపైగా సీట్లు సాధిస్తామని పీసీసీ చీఫ్ ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త చెమటోడ్చి కష్టపడ్డారని బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. గెలుపు కోసం పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు ప్రతికార్యకర్త కృషి చేశారన్నారు. ఈ విజయం వారికే అంకితమిస్తున్నామన్నారు.

## గెలుపోటములు సహజం..: కేటీఆర్

**అక్షరటుడే, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. గెలుపు కోసం తీవ్రంగా శ్రమించినా.. బీఆర్ఎస్ ఓడిపోయింది. ఈ ఓటమిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఫలితం తమను కొంత నిరుత్సాహ పరిచిందని చెప్పారు. అయినా తాము కుంగిపోవడం లేదన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నియోజవకర్గంలోని 407 బూత్‌లలో తమ నాయకులు చాలా కష్టపడ్డారని చెప్పారు.



### ప్రత్యామ్నాయం బీఆర్ఎస్

ఎన్నికలకు ముందు ప్రతి సర్వే బీఆర్ఎస్ గెలుస్తుందని చెప్పినట్లు కేటీఆర్ తెలిపారు. చివరి మూడు రోజులు ఏం జరిగిందో అందరికి తెలుసన్నారు. అయితే కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ అని ఈ ఎన్నికలతో అర్థం అయిందన్నారు. తాము అధికారంలో ఉన్న సమయంలో ఏడు ఉప ఎన్నికలు జరిగితే ఐదు చోట్ల గెలిచామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఒకటి కూడా గెలవలేదన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 2 సీట్లు గెలిచినా.. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. రాజకీయాల్లో ఇలాంటివి కామన్ అని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో తమ పార్టీ సోషల్ మీడియా వారియర్ల ఎంతో కృషి చేశారన్నారు.

ఫలితాలతో కార్యకర్తలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని కేటీఆర్ సూచించారు. ప్రభుత్వాన్ని నిలదీయడంలో సక్సెస్ అయ్యామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని సూచించారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పరిస్థితి ఇంకా దారుణంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. తమ ప్రచారానికి భయపడి అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారని కేటీఆర్ అన్నారు. ఏది ఏమైనా ప్రజాతీర్పు శిరోధార్యం అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు నిరాశపడొద్దని, రబ్బర్ బంతిలా మనం కూడా తిరిగి వస్తామని చెప్పారు. గత రెండేళ్లలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ తన పాత్రను అద్భుతంగా పోషించిందన్నారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్‌ను నిలదీస్తామని ఆయన స్పష్టం చేశారు.